అల్లకల్లోలం

- తుఫాన్‌తో తీరాన్ని కబళిస్తున్న వైనం
- సముద్ర గర్భంలోకి ఇసుక దిన్నెలు
- చెరువులుగా మారిన మడ అడవులు
- తీర ప్రాంత రక్షణపై అలముకున్న నిర్లక్ష్యం

కాట్రేనికోన : సముద్ర తీరానికి రక్షణ కవచంలా ఉన్న ఇసుక దిన్నెలు ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎగసి పడుతున్న కెరటాల ఉధృతికి కోతకు గురవుతోంది. కాట్రేనికోన, అల్లవరం, మల్కిపురం మండలాల పరిధిలో కొత్తపాలెం మొగ ప్రాంతం నుంచి అంతర్వేది మొగ వరకు సుమారు 120 కిలోమీటర్ల దూరం పైబడి తీర ప్రాంతం విస్తరించి ఉంది. తుపానులు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరప్రాంత ప్రజలకు రక్షణ కవచంగా తీరం వెంబడి ఇసుక దిన్నెలు రక్షిస్తున్నాయి. సరుగుడు తోటలు, మడ అడవులను స్వార్థపరులు వారి సొంత ప్రయోజనాల కోసం నరికి వేస్తున్నారు. ఇసుక దిన్నెలలోని ఇసుకను తరలించుకు పోతున్నారు. మరోవైపు సముద్రపు కెరటాల ఉధృతికి తీరం కోతకు గురి అవుతోంది. ఫెంగల్ తుపానుతో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడటంతో అంతర్వేది మొగ ప్రాంతం నుంచి కొత్తపాలెం మొగ వరకు తీరం వెంబడి ఉన్న ఇసుక దిన్నెలు కోతకు గురై సముద్ర గర్భంలో కలిసి పోతోంది.

తుపాన్లకు తట్టుకొనే చెట్లు అవసరం

సముద్ర తీరాన్ని రక్షించేందుకు ఉప్పు నీటిని తట్టుకునే తుమ్మ, తాడి చెట్లు, మడ అడవులు, సరుగుడు తోట్ల పెంపకాన్ని చేపట్టవలసి ఉంది. 1996 తుఫాన్ విధ్వంసానికి వందలాది మంది మృత్యువాత పడ్డారు. తీరం వెంబటి ఉన్న మడ అడవులు తుఫాన్ తీవ్రతను తగ్గించి కాట్రేనికోన మండల పరిధిలోని పల్లం, చిర్రయానం, బలుసుతిప్ప, నీళ్ళరేవు, చాకలిపేట, గొల్లపేట, కొత్తపాలెం, మొల్లేటిమెగ, మగసానితిప్ప గ్రామాలకు రక్షణగా నిలిచాయి. సముద్ర వాతావరణాన్ని తట్టుకొని తీరం వెంబడి పెరిగే తుమ్మ, తాడి, సరుగుడు చెట్లు, మాంగ్రూవ్ అడవులను వన సంరక్షణ సంఘాల ఆధ్వర్యంలో పెంపకం చేపట్టేందుకు చర్యలు చేపట్టినా ఆచరణ శూన్యంగా మారింది.

రక్షించేవారేరీ..

ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణగా తీరం వెంబడి ఉన్న మడ అడవులను నరికి చెరువులుగా మార్చేశారు. కందికుప్ప రాతి కాలువ సెక్టారు పరిధిలోని పోర, పల్లం, నీళ్లరేవు, చిర్రయానం పర్ర భూముల వరకు వందలాది ఎకరాల మడ అడవులను నరికి చెరువులుగా మార్చేశారు. ఈ విధ్వంసానికి అటవీశాఖ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. మడ అడవులను, అటవీ శాఖకు చెందిన భూములను రక్షించలేకపోతున్నారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

సముద్రం నుంచి శివారు గ్రామాలను వేరు చేస్తూ రక్షణగా ఉన్న ఇసుక దిన్నెలను కొందరు స్వార్థపరులు వారి స్వప్రయోజనాల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. అంతర్వేది, ఓడలరేవు నుంచి నీళ్లరేవు వరకు ఇసుక అక్రమ తవ్వకాలతో తీరం కరిగి పోతుంది. యథేచ్ఛగా సముద్రపు ఇసుకను ఇసుక మాఫియా తవ్వేస్తున్నా రక్షించవలసిన ఉన్నతాధికారులు అండగా ఉండటం కొసమెరుపు. గతంలో చిర్రయానం, నీళ్లరేవు రహదారి పనులకు తీరం వెంబడి ఉన్న ఇసుక దిన్నెలను తవ్వేసినా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.



కూనవరం స్ట్రయిట్ కట్ ప్రాంతంలో ఫెంగల్ తుఫాన్‌తో కోతకు గురవుతున్న తీరం

తీరం వెంబడి ఇసుక దిన్నెలు ఎత్తు తరిగి పోవడంతో సముద్రపు నీరు సరాసరి పరివాహక ప్రాంతాలకు చేరే ప్రమాదం పొంచి ఉంది. కూనవరం స్ట్రయిట్‌కట్ కోతకు గురి కావడంతో సముద్రపు నీరు సరాసరి పర్ర భూమిలోనికి చేరే ప్రమాదం పొంచి ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం

సముద్రం కోతకు గురైతే కాట్రేనికోన మండల పరిధిలోని చిర్రయానం, నీళ్లరేవు, చాకలిపేట, గొల్లపేట, కొత్తపాలెం, ముల్లేటి మెగ, బలుసుతిప్ప, పల్లం, గచ్చకాయలపోర, పోర, ఉప్పలగుప్తం మండలంలోని రాఘవులుపేట, ఎస్ యానం, వాసాలతిప్ప, రామేశ్వరం, కొమరగిరి పట్టణం, ఓడలరేవు, మల్కిపురం మండలం కరవాక, అంతర్వేది తదితర గ్రామాలకు తుఫాన్ల సమయంలో ముప్పు పొంచి ఉంది. సముద్ర తీరం వెంబడి తాడి, మడ, సరుగుడు చెట్లు పెంచడంతో పాటు ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తీరం కోతకు గురై నక్కపల్లి వలస మత్స్యకారుల పాకల వరకు ముందుకు వచ్చిన సముద్రం

భవిష్యత్తుకు ముప్పు

పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు తుపానులు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి సముద్ర తీర ప్రాంతాలను పరిరక్షిస్తున్న మడ అడవులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అలా కాకుండా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో వాటిల్లే ముప్పునకు మనమే కారకులంగా మిగులుతాం.



దూలం శ్రీనివాసరావు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

క్లుప్తంగా

నేడు ఎయిడ్స్‌పై అవగాహన

అమలాపురం టౌన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ర్యాలీని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యానాం ఎస్సై నూకరాజు

తాళ్లరేవు: క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసికోల్లాసం పెరగడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని సుంకరపాలెం శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ డీవీవీ విజయలక్ష్మి అన్నారు. శనివారం సుంకరపాలెం, యానాం బ్రాంచిలలో స్పోర్ట్స్‌డే నిర్వహించారు. యానాం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నూకరాజు క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్, స్కూల్ డీన్‌లు టి.వెంకటరత్నం, యం.శేషగిరిరావు, ప్రైమరీ ఇంచార్జ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత రాము మృతికి సంతాపం

అమలాపురం టౌన్: రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ నాయకుడు గల్లా రాము మృతి పట్ల పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సంతాపం వ్యక్తం చేశారు. అమలాపురంలోని మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాలుగు దశాబ్దాల పాటు కార్మికుల సంక్షేమం కోసం తపన పడిన రాము మృతి జిల్లా కార్మిక లోకానికి తీరని లోటని ఆయన సేవలను కొనియాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 19న గొల్లల మామిడాడ పెదపూడికి చెందిన ఉల్లం అరుణ్‌కుమార్, ఆకుల సురేష్‌లు మోటారు బైక్‌పై వెళుతూ ముమ్మిడివరం పదో మైలురాయి 216 జాతీయ రహదారిపై అదుపు తప్పి పడిపోయారు.ఈ ప్రమాదంలో ఉల్లం అరుణ్‌కుమార్ అదే రోజు మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన అకుల సురేష్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపుల నిర్వాహకుల అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్, అల్లవరం మండలాల్లో అనధికారికంగా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలేనికి చెందిన నాగబత్తుల సుబ్రహ్మణ్యాన్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలు, అల్లవరం మండలం దేవగుప్తానికి చెందిన పెనుమాల ప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల్లో ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఎల్.చిరంజీవి తమ బృందాలతో దాడులు చేశారని సీఐ సత్యనారాయణ తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ శనివారం తెలిపారు. కరపకు చెందిన పుణ్యమంతుల అప్పలరాజు అనే వ్యక్తి 17 మద్యం సీసాలను తరలిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై వై.నాగేంద్రకృష్ణ, స్టేషన్ సిబ్బంది, ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి కోసం ఆందోళన

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెంలో ఓ రహదారిని ఒక వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో ఆ ప్రాంత ప్రజలు అదే రోడ్డు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. వర్షంతో ముంపునకు గురై తాము నానా యాతన పడుతుంటే ఆ రోడ్డు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవడంపై స్థానిక ప్రజలు నిరసనకు దిగారు. ఈ సమస్యపై గతంలో మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. అసలు రోడ్డు ప్రాంతాన్ని రిజిస్ట్రార్ కార్యాలయం ఎలా రిజిస్ట్రేషన్ చేసిందని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపు మోసపూరితం

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు సామాన్యులకు మరింత భారం కానున్నాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విద్యుత్ బిల్లులు పెంచబోమని కూటమి పార్టీల ముఖ్య నాయకులు హామీ ఇచ్చి అధికారం చేపట్టాక తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ శనివారం సాయంత్రం అమలాపురంలో ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు చార్జీలు పెంచి రూ.15,585 కోట్ల మేర ప్రజలపై భారం పెట్టి నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఊరువాడా విస్తృత ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు ధరలు విపరీతంగా పెంచారని ధ్వజమెత్తారు. పెంచిన చార్జీలు తక్షణమే తగ్గించాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం చిరు ఉద్యోగులైన వేలాది మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను నిలిపివేయడమే కాక వారి జీతాలను సైతం ఇవ్వకుండా దోబూచులాడుతోందని విమర్శించారు.



బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

ఫసల్ బీమాతో రైతుకు మేలు

జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

అమలాపురం రూరల్: వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజనను అమలు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడికి నష్టం వాటిల్లిన సందర్భంలో రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణ, రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఉపయోగపడుతుందన్నారు. రైతు సోదరులు తమ పంట పొలాలకు బీమా కట్టుకోవటానికి కామన్ మ్యాన్ సర్వీస్ సెంటర్‌లో రబీ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లాగిన్ ఓపెన్ అయిందన్నారు. కౌలు రైతులే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకి అర్హులన్నారు. వీరికి కౌలు రైతు కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. డిసెంబరు 31లోగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధుల నిలిపివేత

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద గల మీసేవా కేంద్ర భవనాన్ని మున్సిపాలిటీ ఓ వ్యాపార సంస్థకు అద్దెకు ఇచ్చి దానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు మున్సిపల్ నిధులు రూ.9 లక్షలు కేటాయించిన అంశం వివాదాస్పదమైంది. ఓ కాంట్రాక్టర్ రాజకీయ పైరవీలతో వ్యాపార సంస్థ ప్రైవేటుగా నిర్మించుకునే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం మున్సిపాలిటీ రూ.9 లక్షలు ఇచ్చే అంశంపై గత నెల 27న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు నిలదీసిన సంగతి తెలిసిందే. దీంతో కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు కేటాయింపు దశ వరకూ వెళ్లిన రూ.9 లక్షల మున్సిపల్ నిధులను నిలిపివేయాలని సంబధిత ట్రెజరీ అధికారులకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు.

దీంతో ఈ ప్రయత్నానికి శనివారం పూర్తిగా బ్రేకులు పడ్డాయి. విద్యుత్ శాఖకు చెల్లించేందుకు సిద్ధమైన రూ.9.03 లక్షల నిధులను నిలిపివేసినట్లు కమిషనర్ రాజు తెలిపారు. దీంతో కౌన్సిల్‌లో ఈ అంశంపై చెలరేగిన వివాదానికి తెర పడినట్లయింది.

మార్మోగిన గోవిందనామం



భక్తులతో కిటకిటలాడిన వేంకటేశ్వరస్వామి ఆలయం

ముమ్మిడివరం: నగర పంచాయతీ శివారు పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వర స్వామి ఆలయం కార్తికమాసం ఆఖరి శనివారం కావడంతో భక్తులతో కిటకిట లాడింది. జోరుగా వర్షం కురుస్తున్నా భక్తులు అధిక సంక్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కొండవీటి రాంబాబు, ఆదిత్య ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పెన్మత్స చిట్టిరాజు, కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.సాయంత్రం వరకు భక్తుల తాకిడి కొనసాగింది.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమలాపురం రూరల్: భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులతో అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శివకేశవుల అవతారంలో త్రయంభకేశ్వరుడు

అమలాపురం రూరల్: మండలంలో పాత బండారు లంకలో వేంచేసి యున్న భువనేశ్వరీ సమేత త్రయంభకేశ్వర స్వామి కార్తికమాసం ఆఖరి శనివారం కావడంతో శివకేశవులుగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామిని శివకేశవులుగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. శ్రీ శైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు స్వామివార్లకు పూజలు చేశారు.

అకాల వర్షంతో అవస్థలు



వాసాలతిప్పలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు



భీమనపల్లిలో నీట మునిగిన ప్రధాన రహదారి



ఓడలరేవులో అల్లకల్లోలంగా మారిన సముద్రం

ఉప్పలగుప్తం: ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న అకాల వర్షాలకు శనివారం ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లు జలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. తీర ప్రాంతాలైన ఎస్.యానం, వాసాలతిప్ప గ్రామాల్లో మత్స్యకారుల వేటకు అంతరాయం కలగటంతో ఇళ్ల వద్దనే కూర్చుని వలలు బాగు చేసుకుంటున్నారు. ఖరీఫ్ పంట చేతికొచ్చిన తరుణంలో వర్షాలు కురుస్తుండటంతో పంట నేల కొరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈదురు గాలులతో వర్షం

అల్లవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఓడలరేవు వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ వద్ద సముద్ర కెరటాలు టెర్మినల్ ప్రహరీ గోడను తాకుతూ రోడ్డుని ధ్వంసం చేస్తున్నాయి. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో సముద్రంలో భారీ అలలు ఎగసిపడుతూ తీరాన్ని తాకుతున్నాయి. దీంతో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం అడపాదడపా జల్లులు కురిసినా మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తుంది. దీంతో తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తమైయ్యారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, దుర్గా శ్రీను, చిక్కం శ్రీను, రెడ్డి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగి జీవితానికి సార్థకత

అమలాపురం టౌన్: ఏఎస్సై డాక్టర్ పొన్నపల్లి విశ్వనారాయణ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ కేవీవీ ప్రసాద్‌బాబు పోలీసుశాఖకు ఉన్నతమైన సేవలు అందించారని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు కొనియాడారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఈ ఇద్దరు ఉద్యోగుల ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం జరిగిన వీడ్కోలు సభలో ఎస్పీ కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. కాట్రేనికోన ఏఎస్సైగా పనిచేస్తున్న డాక్టర్ విశ్వనారాయణ కృష్ణ తన సర్వీస్‌లో పలు క్యాష్ అవార్డులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉత్తమ సేవా పతకాలతో పాటు పద్య, నాటక రంగంలో నంది అవార్డులు పొందారని ఎస్పీ గుర్తు చేశారు. జిల్లా ఆర్మ్‌డ్ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు జిల్లా పోలీస్ యూనిట్‌కు ఎనలేని సేవలు అందించారని ఎస్పీ పేర్కొన్నారు. వీరిద్దరినీ ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్‌లు ఘనంగా సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.విజయసారథి, ఆర్మ్‌డ్ ఆర్‌ఐ బ్రహ్మానందం, ఎస్పీ కార్యాలయ సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భూసమేత వేంకటేశ్వర స్వామి

ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని భీమనపల్లి భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్స్ జిల్లా భౌతిక, గణిత శాస్త్ర ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఉపకార వేతన పరీక్షను(ఎన్‌ఎంఎంఎస్) ఆదివారం మూడు కేంద్రాల్లో నిర్వహిస్తునట్లు జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పరీక్ష మూడు డివిజన్లలోని మూడు కేంద్రాలలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలన్నారు.

ఎల్జీని కలిసిన సీఎం రంగసామి

యానాం: ఎల్జీ కె కైలాష్‌నాథన్‌ను శనివారం సీఎం రంగసామి రాజ్‌నివాస్‌లో కలిశారు. ప్రస్తుతం యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో మూతపడ్డ రేషన్ షాపులను తిరిగి ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీపావళి నుంచి రేషన్‌షాపుల ద్వారా ఉచితబియ్యం పథకానికి శ్రీకారం చుట్టినప్పటికి అన్ని రేషన్‌షాపుల్లో అమలు కాలేదన్నారు. 20 కేజీల బియ్యం బ్యాగ్‌లను రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేసే ఫైలును ఆమోదించాలని ఎల్జీని సీఎం రంగసామి కోరారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో జరిపిన దాడుల్లో సారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు శాఖ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో సత్యనారాయణను 5 లీటర్ల సారాతో అరెస్టు చేసి, స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఆమె తెలిపారు.

సమైక్యతతో యాదవుల అభివృద్ధి



కార్తిక వనసమారాధనలో మాట్లాడుతున్న సంఘీయుడు

యానాం: యాదవులు ఐక్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని పలువురు యాదవ నాయకులు పేర్కొన్నారు. శనివారం కృష్ణ చైతన్య యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో ఐక్య వనసమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేదలైన యాదవులకు, విద్యార్థులకు సేవలు అందించే విధంగా ప్రణాళికాబద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరారు.మట్టా సురేష్‌బాబు యాదవ బృందం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు కుండల సాయికుమార్, అల్లురాజు, మాజీ మండలాధ్యక్షుడు మందాల గంగ సూర్యనారాయణ, గొంటికుమార్ చొదరియాదవ్, నాయకులు పెనుగొండ దుర్గబాబు, మట్టా పుల్లారావు, బీరమేను నాగేశ్వరరావు, సార్ల ఏసుబాబు, మట్టా అజయ్ కుమార్, పుట్టి ఏడుకొండలు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

అభయారణ్యంలో విద్యార్థుల సందడి



కోరింగ అభయారణ్యాన్ని సందర్శించిన ఆచార్య నాగార్జున కళాశాల విద్యార్థులు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశమైన కోరింగ అభయారణ్యాన్ని శనివారం గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫారెస్ట్ చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలన్నింటినీ ఆసక్తిగా తిలకించారు. చెక్కల వంతెనలపై నడుస్తూ, బోటు షికారు చేసి ఆనందించారు. అభయారణ్యంలోని విశేషాలను ఫారెస్ట్ అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు కె.మహేష్, కె.ధనుంజయరావు, కె.ధనలక్ష్మి ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.